
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శుక్రవారం 28 నవంబరు 2025





- ఆసక్తికరంగా మారుతున్న పంచాయతీ పోరు
- సర్పంచ్ స్థానాల్లో పాగాకు పార్టీల తహతహ
- తమ మద్దతుదారులను గెలిపించుకునేందుకు వ్యూహాలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాల పైనే కాంగ్రెస్ ఆశలు
- ఇందిరమ్మచీర కానుక కలిసి వస్తుందనే నమ్మకం
- బీసీ ఓట్లపై ప్రతిపక్షాల గురి
- 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ మాట తప్పిందని ప్రచారం
- కాంగ్రెస్‌కు సవాల్.. బీఆర్ఎస్‌కు జీవన్మరణం..

ఎవరి ఎ'జెండా' వారిదే..

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

పంచాయతీ ఎన్నికల్లో గెలుపు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారింది. పార్టీలకతీతంగా జరిగే పల్లె పోరులో పార్టీ జెండా ఎగురవేయాలని తహతహలాడుతున్నాయి. తమ పార్టీ మద్దతుదారులను బరిలో దించేందుకు గ్రామాల్లో నేతలు మంతనాలు జరుపుతున్నారు. ప్రజల్లో పలుకుడి, ఆర్థిక స్థోమత ఉన్న అభ్యర్థుల కోసం వెతుకుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి నినాదంగా పల్లెల్లో పాగా వేసేందుకు అధికార కాంగ్రెస్ పావులు కదుపుతుండగా, బీసీ జెండానే ఎజెండాగా ప్రతిపక్షాలు పల్లె పోరులో కాంగ్రెస్‌ను ఢీకొనేందుకు సిద్ధమవుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, పార్టీ పునాదులను పటిష్ఠం చేసుకునే దిశగా అన్ని పార్టీలు ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకుంటున్నాయి.

పార్టీల ఫోకస్

పంచాయతీ ఎన్నికలు పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్నారు. పార్టీ గుర్తులు, రాజకీయ హామీలు లేకుండా.. సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు బరిలో దిగుతున్నారు. అయితే పల్లెపోరులో పైచేయి సాధించేందుకు ఆయా పార్టీల నేతలు తమ మద్దతుదారులను బరిలో దించుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,708గ్రామ పంచాయతీలు, 15,006 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

గత సర్పంచ్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో మెజార్టీ స్థానాలను అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఏ పార్టీ మద్దతు లేకుండా స్వతంత్రంగా గెలిచిన సర్పంచ్‌లు కూడా అభివృద్ధి కోసం గులాబీ కారెక్కారు. ప్రస్తుతం జనగామ మినహా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. దీంతో మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యూహలను అమలు చేస్తుంది. ఇప్పటికే పోటీ లేని చోట నామినేషన్లు వేసుకునేందుకు అభ్యర్థులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, మాదవరెడ్డి, కేఆర్ నాగరాజు తదితరులు తమ నియోజకవర్గాల్లో అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నారు. పోటీ ఎక్కువగా ఉన్న గ్రామాల్లో పోటీదారుల మధ్య రాజీ ప్రయత్నాలు చేస్తున్నారు. సర్పంచ్ పదవి పోటీ నుంచి తప్పుకుంటే ఎంపీటీసీకి అవకాశం ఇస్తామని కొన్ని చోట్ల హామీలు ఇస్తున్నారు.

మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థులకు దీటుగా బరిలో దించేందుకు బీఆర్ఎస్ కూడా ఆర్థికంగా బలమైన నేతలను, పార్టీకి నమ్మకంగా ఉన్నవారిని గుర్తించి టికెట్ల కేటాయిస్తున్నారు. పాలకుర్తి, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నర్సంపేట పెద్ది సుదర్శన్‌రెడ్డి, భూపాలపల్లిలో గండ్ర వెంకటరమణారెడ్డి, పరకాలలో చల్లా ధర్మారెడ్డి ఇప్పటికే మండలాల వారీగా సమావేశాలు నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియలో ఉన్నారు.

అయితే బీజేపీ స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉన్నప్పటికీ నేతల మధ్య సమన్వయం లేదనే టాక్ వినిపిస్తుంది. పోటీ చేసే అభ్యర్థుల ఎంపికతో పాటు (మిగతా 7లో..)

మొదలైన నామినేషన్లు

- తొలిరోజు సర్పంచ్ స్థానాలకు 116 మంది పత్రాల దాఖలు
- వార్డులకు 56 మంది అభ్యర్థులు అందజేత



మల్యాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి ఆవుల వెంకన్న



గూడూరు జీపీలో నామినేషన్ దాఖలు చేస్తున్న వాంకుడోతు సునీత

మహబూబాబాద్ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో తొలివిడత డిసెంబర్ 11న నిర్వహించే గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు మొదటిరోజు 116 నామినేషన్లు దాఖలు కాగా, వార్డులకు 56 నామినేషన్లు పడ్డాయి. గురువారం ఉదయం 10.30 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో నామినేషన్ల పర్వం ప్రారంభం అయ్యింది. జిల్లాలోని ఐదు మండలాలు మానుకోట, నెల్లికుదురు, గూడూరు, కేసముద్రం, ఇనుగుర్తి మండలాల్లోని 155 గ్రామ పంచాయతీలు, 1,338 వార్డులకు తొలి విడతలో ఎన్నికలు జరగనుండగా, ఆయా స్థానాలకు ఈనెల 27 నుంచి 29 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.

గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్, వార్డుసభ్యులకు పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు 48 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో రిటర్నింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ఆఫీసర్లు పోటీ చేసే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తొలి విడతలో జరిగే సర్పంచ్ స్థానాలకు తొలిరోజు 116 నామినేషన్లు దాఖాలు కాగా,

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మొదటి రోజు 27-11-25

మండలం పేరు	మొత్తం సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	మొత్తం వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
మహబూబాబాద్	41	20	338	12
కేసముద్రం	29	21	254	04
గూడూరు	41	28	354	18
నెల్లికుదురు	31	33	280	17
ఇనుగుర్తి	13	14	112	05

వార్డులకు 56 నామినేషన్లు పడ్డాయి. కాగా, మహబూబాబాద్ మండలం పర్వతగిరి, జంగిలిగొండ, వీఎస్. లక్ష్మీపురం నామినేషన్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ కె.మధుకర్‌బాబు సందర్శించారు.

మానుకోట మండలంలో..

- మహబూబాబాద్ మండలంలో సర్పంచ్ స్థానాలకు 20 నామినేషన్లు దాఖలయ్యాయి. కంబాలపల్లి జీపీ సర్పంచ్ స్థానానికి నాలుగు, బోడగుట్టతండాకు-2, మల్యాల-1, సాదుతండా-1, సికింద్రాబాద్‌తండా-1, నడివాడకు-1, ముడుపుగల్-2, అమనగల్-3, జర్పులతండా-1, లక్ష్మీపురం తండా-1, వీఎస్.లక్ష్మీపురం-1, జంగిలిగొండ సర్పంచ్ స్థానానికి రెండు నామినేషన్లు రాగా, వార్డులకు గాను 12 నామినేషన్లు దాఖలు అయ్యాయని అధికారులు తెలిపారు.
- కేసముద్రం : మండలంలో సర్పంచ్ స్థానాలకు 21 నామినేషన్లు, వార్డులకు గాను నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు

(మిగతా 8లో..)

మహమూద్‌పట్నం జీపీ ఎన్నికలపై హైకోర్టు స్టే

ఆరుగురు ఎస్టీ ఓటర్లకు.. 4 స్థానాల రిజర్వేషన్‌పై అభ్యంతరం



మహమూద్‌పట్నం గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులు

కేసముద్రం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నం గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైకోర్టు నిలుపుదల ఉత్తర్వులను గురువారం సాయంత్రం జారీ చేసింది. గ్రామంలో సర్పంచ్, మూడువార్డులు ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మహమూద్‌పట్నంకు చెందిన మిట్టగడుపుల యాకూబ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు కోర్టు వాదప్రతివాదనలు విన్న అనంతరం గ్రామంలో రెండు కుటుంబాలకు చెందిన ఎస్టీ ఓటర్లు కేవలం ఆరుగురే ఉన్నందున, రిజర్వేషన్ల కేటాయింపులో అసాధారణ పరిస్థితులు ఉన్నాయని, వీటిని పునఃపరిశీలించాలని, అప్పటి వరకు ఎన్నికలు నిలిపివేయాలని కోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను వచ్చేనెల 29కి వాయిదా వేసింది.

ఎన్నికలకు పోలీసుల అలర్ట్

- జిల్లాలో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు



ఇనుగుర్తి జీపీ నామినేషన్ స్వీకరణ కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడువిడతలుగా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం పోలీసులు అలర్ట్ అయ్యారు. ఈ నెల 27 తొలివిడత ఎన్నికలు జరిగే ఐదు మండలాల పరిధిలోని పంచాయతీలకు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎస్పీ శబరీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏనిమిది చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు డబ్బు, మద్యం తరలించకుండా జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, ప్రతీవాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేసి పంపిస్తున్నారు. డోర్నకల్ మండలం ముల్కాల పల్లి వద్ద గురువారం సీఐ చంద్రమౌళి నేతృత్వంలో తనిఖీలు ముమ్మరం చేశారు. అదే విధంగా ఎన్నికలు నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్పీ శబరీష్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

- 'దీక్షా దివస్' చరిత్రను భావితరాలకు తెలియచేయాలి
- ఇందిరాగాంధీ పేరిట చీరల పంపిణీ సిగ్గుచేటు
- మాజీమంత్రి సత్యవతిరాథోడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వాగ్దానాలు, మాయమాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పంచాయతీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకురాలు సత్యవతిరాథోడ్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రెండేళ్లుగా మహిళలకు బతుకమ్మ చీరలు పంచని కాంగ్రెస్ పాలకులు, గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందు పంచారని, అది కూడా ఇందిరా గాంధీ పేరిట పంపిణీ చేయడం సిగ్గుచేటన్నారు. ఈనెల 29న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్‌ను నిర్వహిస్తున్నామని పెద్ద ఎత్తున కార్యకర్తలు, ఉద్యమకారులు తరలివచ్చి, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ : మాజీ ఎంపీ కవిత

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ పేరిట బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని చెప్పి, వారి ఓట్లతో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిందని (మిగతా 8లో..)

'అక్రమ కేసులను ఎత్తివేయాలి'



మాట్లాడుతున్న కాంగ్రెస్, వామపక్ష నేతలు

మహబూబాబాద్‌టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాటి బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని డీసీసీ మాజీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ నాయకులు సాదుల శ్రీనివాస్, బి.అజయ్‌సారథిరెడ్డి, గౌని ఐలయ్య విజ్ఞప్తి చేశారు. బయ్యారం ఉక్కుపరిశ్రమ ఏర్పాటు ఉద్యమకేసులో మహబూబాబాద్ జిల్లా కోర్టుకు గురువారం కాంగ్రెస్, వామపక్ష నేతలు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ అక్రమకేసులు ఎత్తివేసి ఉద్యమకారులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లు సుధాకర్‌రెడ్డి, పెరుగు కుమార్, సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, పోతురాజు రాజు, బానోత్ ప్రసాద్, ఇరుగు మనోజ్, మధు, రవి, సమ్మెట రాజమౌళి, మాధవి, స్వరూప, శ్రీనివాస్, రవికుమార్, దిలీప్, నరేష్, భాస్కర్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు




తార్యతండాలో మాట్లాడుతున్న వల్లభు వెంకటేశ్వర్లు

గూడూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోనే రాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. తార్యతండాలో గురువారం బీజేపీ జిల్లాస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా తెలంగాణలో గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందాయంటే కేవలం కేంద్రప్రభుత్వం విడుదల చేసిన నిధులేనని చెప్పారు. గ్రామపంచాయతీలకు సాధికారత కల్పించడం ద్వారా అట్టడుగు స్థాయిలో ఉన్న గ్రామాలు అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు సరైన సమయంలో నిర్వహించి ఉంటే కేంద్రం నుంచి భారీ మొత్తంలో నిధులు వచ్చేవని చెప్పారు. పార్టీ జిల్లా, మండల నాయకులు మేరెడ్డి సురేందర్, నర్సింహారెడ్డి, చెల్పూరి వెంకన్న, గడ్డం అశోక్‌కుమార్, మదన్‌నాయక్, శశివర్ధన్‌రెడ్డి, ఉప్పునూతల రమేష్, నాగేశ్వరచారి, ఉపేందర్, వెంకటేష్, మధుకర్, సందీప్ పాల్గొన్నారు.

ముందు నామినేషన్లు..

- మానుకోట నియోజకవర్గంతో తొలివిడత ఎన్నికలు
- వ్యూహాత్మకంగా కాంగ్రెస్.. ప్రతిష్టాత్మకంగా బీఆర్ఎస్
- తమ గాడ్‌ఫాదర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు
- అధికార, ప్రతిపక్ష నేతల ఇళ్లల్లో నాయకుల సందడి

ఆపై ఉపసంహరణలు..!!



మహబూబాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతోనే పల్లెల్లో పంచాయతీ సమరానికి శంఖారావం పూరించినట్లయింది. జిల్లాలో ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారం షురువైంది. తొలివిడత గ్రామపంచాయతీ ఎన్నికలు మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, గూడూరు మండలాల్లో జరుగనున్నాయి. ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఖద్దర్ నేతల ఇళ్లన్నీ తెల్లవారుజాము నుంచే (మిగతా 8లో..)

పార్టీలకు.. 'బీసీ' పరీక్ష

● సవాలుగా మారనున్న జనరల్ స్థానాల్లో సీట్ల కేటాయింపు ● అధికార పార్టీ నేతల్లో చర్చలు ● ఇతర పార్టీల్లోనూ అదే పరిస్థితి

తొర్రూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేయాలని మొత్తం స్థానాలు కేటాయించాలన్న అంశం ఇప్పుడు అన్ని పార్టీలకు పరీక్షగా మారింది. ఇటీవల జరిగిన కేబినెట్ మీటింగ్‌లో బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ అనధికార రిజర్వేషన్ల అమలుపై క్షేత్రస్థాయిలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈక్రమంలో మొదటి విడత ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. ఏమేరకు అనధికార రిజర్వేషన్లు అమలవుతాయో అన్నదే చర్చ జరుగుతుండగా మరోవైపు అన్‌రిజర్వ్‌డ్ గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానాల్లో పోటీ పెరిగే సూచన ఉంది.

జిల్లాలో సామాజిక వర్గాలు

జిల్లాలో 482 గ్రామపంచాయతీలుండగా వాటిలో ఎస్టీలకు 295, ఎస్సీలకు 41, బీసీలకు 19 సర్పంచ్ స్థానాలు కేటాయించారు. జనరల్‌కు 127 సర్పంచ్ స్థానాలున్నాయి. గురువారం వచ్చిన కోర్టు తీర్పు ప్రకారం కేసముద్రం మండలంలోని గ్రామ పంచాయతీలో ఎన్నికలు నిలిపివేయాలని కోర్టు స్టే ఇచ్చింది. డెడికేటెడ్ కమిషన్ సిఫారసు మేరకే గత రిజర్వేషన్లనే ఖరారు చేశారు. అధికార కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం తీవ్రంగా ప్రయత్నించింది. అన్ని పార్టీలు మద్దతిచ్చాయి. కానీ అంశం కోర్టు పరిధిలో ఉండడంతో అధికారికంగా రిజర్వేషన్లు అమలు కా లేదు. ఈక్రమంలో పార్టీపరంగా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది

స్థానిక నాయకులకు సవాల్

గ్రామ పంచాయతీల్లో పార్టీ రహితంగా ఎన్నికలు జరుగుతున్నా ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేయడం సాధారణ విషయమే. అధికార పార్టీ అనధికార బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించడంతో ఇది క్షేత్ర స్థాయిలో ఏమేరకు అమలవుతుందో అధికార పార్టీ నాయకులకు సవాలుగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఇంతకముందు బీసీలకు 42శాతం రిజర్వేషన్‌తో ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా జీవో జారిచేసినా కోర్టు కేసు కారణాలతో నిలిచిపోయింది.



వెంకటాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం

జనరల్ స్థానాల్లో పోటాపోటీ

జనరల్ గ్రామపంచాయతీల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో సిద్ధమవుతున్నారు. అన్‌రిజర్వ్‌డ్ ఉన్న పంచాయతీల్లో అధికార పార్టీ నుండి నలుగురు జనరల్ కేటగిరీ నాయకులు ఇతరులు కూడా పోటీకి సై అంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి అనధికార బీసీ రిజర్వేషన్ల అంశం అధికార పార్టీ నాయకులు తెరపైకి తేవడంతో ఆయా వర్గాల నుండి తీవ్ర ఒత్తిగి పెరుగుతుంది. బీసీ అభ్యర్థులను ఎంపిక చేయకుంటే దాని ప్రభావం ఎలా ఉంటుందో అని చర్చ కూడా జరుగుతుంది. విపక్షపార్టీలు కూడా స్థానిక బీసీ నాయకులను అనుకూలంగా మార్చుకునే అవకాశాలు ఉండడంతో అధికార పార్టీ నాయకులు ఆచితూచి అడుగేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి

మరొకరికి తీవ్ర గాయాలు



గణేష్ (ఫైల్)

మరిపెడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపుతప్పి ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం రాత్రి మరిపెడ మండలం బుర్హాన్‌పురం శివార్లోని పత్తిమిల్లు కార్నర్ దగ్గర చోటు చేసుకుంది. బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన నీరుడు గణేశ్(20), బోళ్ల రాజేశ్ డీజిల్ కోసం బైక్‌పై మరిపెడబంగ్లాకు వస్తుండగా నేషనల్ హైవేపై బైక్ అదుపుతప్పి వెనుక కూర్చున్న నీరుడు గణేశ్ తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆయనను స్థానిక 108 సిబ్బంది జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు పరిస్థితి విషమం అని తెలుపడంతో ఖమ్మానికి తరలించారు. చికిత్స పొందుతూ గణేశ్ మృతి చెందారు. బైక్ నడపుతున్న బోళ్ల రాజేశ్‌కు కాలు విరిగింది. మరిపెడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అ ప్రమాదం జరిగిన దగ్గరే ఓ కారు అదుపుతప్పి పల్టీకొట్టింది. దీంతో బైక్‌ను కారు ఢీకొనడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు ఆ దిశగా విచారణ చేస్తున్నారు.

'ఆంగ్లంపై పట్టు సాధించాలి'

మరిపెడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆంగ్ల సబ్జెక్టుపై పట్టు సాధించాలని మరిపెడ ఎంఈవో అనితాదేవి అన్నారు. గురువారం మరిపెడ హైస్కూల్‌లో ఎల్టా ఆధ్వర్యంలో మండల స్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షలు నిర్వహించగా ఎంఈవో ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నైపుణ్యంతో కూడిన బోధన జరుగాలని ఆమె ఉపాధ్యాయులను కోరారు. మండల స్థాయి ఒలింపియాడ్ పరీక్షలో నర్మద, ఐశ్వర్య, లిఖిత, హర్షవర్ధన్, నాగేశ్వరి, దేవి విజ్ఞత, అస్మితలు ప్రతిభ చాటారు. వీరిని ఎంఈవో అభినందించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్టా జిల్లా ప్రధాన కార్యదర్శి బయగాని రాంమోహన్, ఆంథోని డిసౌజా, మంగు, నెహ్రూ, మర్రెడ్డి, లింగనాయక్, లచ్చిరామ్ తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా స్థాయి ఒలంపియాడ్ పరీక్షలు డిసెంబర్ 18న జరుగుతాయి.

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పెద్దవంగర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో బుదారపు శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ ఒలింపియాడ్, ఎడ్యుక్వెస్ట్ టాక్ అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షల ద్వారా విద్యార్థులలో అవగాహన ఏర్పడి పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. ఈపోటీల్లో ఒలింపియాడ్ సీనియర్ విభాగంలో రాపోలు రవికిరణ్, జూనియర్ విభాగంలో వరుణ్, ఎడ్యుక్వెస్ట్ టాక్ సీనియర్ విభాగంలో రవికీర్తన్, జూనియర్ విభాగంలో దేశెట్టి శరణ్యలు ప్రతిభ కనబర్చిగా వారికి బహు మతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. శివకుమార్, వెంకటేశ్వర్లు, తకిపాషా, అంజయ్య, భాస్కర్, రాజలింగం, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



ఎమ్మెల్యే యశస్వినితో కాంగ్రెస్ నాయకులు

పెద్దవంగర, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి గ్రామాలలో కాంగ్రెస్‌పార్టీ జెండా ఎగురవేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షులు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పట్టణ కేంద్రంలో మండలంలోని రామచంద్రుతండా చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ జాటోతు అమల సక్రునాయక్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ ఒక్కరి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నా రు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు అభివృద్ధి, అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిమని తెలిపారు. కాం గ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అర్హులైన ప్రతీ ఒక్కరికి అందిస్తామని తెలిపారు. మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపు కృషి చేయాలని తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : ఝాన్సీరెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అన్ని విధాల అభివృద్ధి చెందుతాయని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం తొర్రూరులోని క్యాంపు కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాలవారిగా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గ్రామాలను అన్ని విధాల అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో ముందుంటుందని, స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. మండలంలోని పెద్దమంగ్యతండా, పెద్దవంగర మండలం హసి తండాకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఉపసర్పంచ్, మండలంలోని చెర్లపాలెంకు చెందిన చెందిన మాజీ సర్పంచ్ నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కిరణ్ బీఆర్‌ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలి



బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్

తొర్రూరు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతీ ఒక్కరు పాటు పడాలని మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని వెల్లికట్టె గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి సర్పంచ్ అభ్యర్థి బందు శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో 420 హామిలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పాలన్నారు. రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ మాట్లాడుతూ సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు తక్కెళ్లపల్లి దేవేందర్ రావు, ప్రదీప్‌రెడ్డి, బత్తుల యాకయ్య, పోసాని రాములు, లింగారావు, బాలకృష్ణ, కుమారస్వామి, బందు రవి, కొమ్ము రాములు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై కళాజాత



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న మరిపెడ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్

చిన్నగూడూరు (మరిపెడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సైబర్ క్రైమ్స్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ సీఐ ఎస్.రాజ్ కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం రాత్రి చిన్నగూడూరుమండలం మంగోరిగూడెంలో సైబర్ క్రైమ్స్, మూఢ నమ్మకాలు, పంచాయతీ ఎన్నికలపై జిల్లా పోలీస్ కళాజాత బృందం ఆట పాటలతో వివరించారు. ఈ సందర్భంగా సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. సైబర్‌క్రైమ్‌కు గురియైతే వెంటనే 1930టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేస్తే సత్వర న్యాయం జరిగే అవకాశం లభిస్తుందన్నారు. మూఢ నమ్మకాలను నమ్మొద్దన్నారు. పంచాయతీ ఎన్నికలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నగూడూరు ఎస్సై ప్రవీణ్, పోలీస్ కళాజాత బృందం, స్థానికులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మరిపెడ రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ కార్యక్రమంలో మరిపెడ మండలంలోని వీరారం జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారుచేసిన ఏ గుడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫర్ స్మార్ట్ అంబులెన్స్ ట్యాక్సిన్ ఫ్రీ హోమ్ ప్రాజెక్ట్‌లు రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనిర్మల తెలిపారు. గురువారం ఆ ప్రాజెక్ట్‌లు తయారుచేసిన విద్యార్థులు చైతన్య, జస్వంత్, అలాగే గైడ్ టీచర్స్ మధు, జానకీలను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రవి, మారెడ్డి వెంకట్, అనిల్‌కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి వీరభద్రం

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రం

వెంకటాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ స్టేట్ టీచర్స్ యూనియన్ (టీఎస్ ఎస్టీయూ) ములుగు జిల్లా ప్రధాన కార్య దర్శి మంచర్ల వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంకటాపురం మండల కేంద్రంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు పూనెం రమణయ్య, ప్రధాన కార్యదర్శి పాండా రామారావు అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో వీరభద్రం మాట్లాడారు. ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష అనేది తీవ్ర మానసిక సంకటంగా మారిందని అన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు సమర్థులని, వారు ఎన్ని పరీక్షలైనా ఎదుర్కొని నిలుస్తారని అన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష క్వాలిఫై కావాలనే తీవ్ర మానసిక ఒత్తిడిలో ఉన్నా రని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులను ఇలా ఒత్తిడికి గురిచేయడం వల్ల తరగతి గదిలో బోధన నాణ్యత దెబ్బతింటుం దన్నారు. ఇది బోధన, అభ్యసన ప్రక్రియకు తీవ్ర ఆటంకంగా మారిందని అన్నారు. సమర్థులైన ఉపాధ్యాయులకు మళ్లీ మళ్లీ పరీక్షలు ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వా లన్నారు. లేనట్లయితే సుప్రీంకోర్టులో న్యాయ పో రాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయ కులు అడప రాజేందర్, వాంకుడోత్ రాంబాబు, ఎస్సీనాయుడు, పోతు రాజశేఖర్, రెడ్డి రాంబాబు, శిరీష, ఉషారాణి, సమ్మక్క, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పరశురామ్‌కు జాతీయ అవార్డు

జనగామ కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ అంబేద్కర్, పూలే జాతీయ అవార్డు అందుకున్నారు. పూలే, అంబేద్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని అంబేద్కర్ ఆడిటోరియంలో గురువారం 72వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థి, యువజన, వికలాంగుల, దళిత సంఘాలలో ఎన్నో పదవులు పొంది, వారి హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి, 2016లో కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి సంఘాన్ని స్థాపించి అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని పల్లె నుంచి ఢిల్లీ వరకు ఎన్నో యాత్రలు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేశాడు. ఆయన చేసిన సామాజిక కార్యక్రమాలను గుర్తించి పరశురామ్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. కాగా బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్‌రాం, ఫౌండేషన్ చైర్మన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రులు పి.వి.రత్నం, మారప్ప, చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు, ఐఏఎస్ అధికారి పరశురామ్, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



అతిథుల నుంచి అవార్డు అందుకుంటున్న పరశురామ్ ←

చిట్‌ఫండ్స్ నిర్వాహకులపై కేసు నమోదు

కాటారం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని భవితశ్రీ చిట్ ఫండ్స్ బ్రాంచి నిర్వాహకులపై కేసు నమోదైంది. ఈ మేరకు ఎస్సై శ్రీనివాస్ గురువారం వెల్లడించారు. 2022లో రూ.5లక్షల చిట్టీ వేసిన తాము డబ్బులు కట్టినప్పటికీ ఎత్తిన డబ్బులు నిర్వాహకులు చెల్లించలేదని, పైగా తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని దామెరకుంటకు చెందిన రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కాటారంలో ఉన్న భవితశ్రీ చిట్‌ఫండ్స్ బ్రాంచ్‌ను ఎత్తేయగా హనుమకొండలోని మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లగా డబ్బులు ఇస్తామని చెప్పి సంవత్సరాలు తిప్పించుకున్నారని బాధితులు పేర్కొన్నారని తెలిపారు. చివరకు ఇటీవల డబ్బులు ఇచ్చేది లేదని బెదిరించారని ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్స్ చైర్మన్ ప్రకాశ్‌రావు, ఎండీ శ్రీనివాస్, ఈడీ నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చెన్నూరు క్రీడాకారులు ఎంపిక

పాలకుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయిలో జరిగే సాఫ్ట్‌బాల్ పోటీ లకు జనగామ జిల్లా మండలం చెన్నూరుకు చెందిన క్రీడాకారులు బాలబోయిన సందీప్, రావుల కుమార్ ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ బాధ్యుడు ఎన్.భగత్ తెలిపారు. జనగామలో ఈనెల 2న క్రిస్టన్ ఇన్‌స్టిట్యూట్ మైదానం లో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించగా వారు ఎంపికైనట్లు తెలిపారు. 28, 28, 29 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో జరిగే 12వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.



సందీప్ కుమార్




లకావత్ ధన్వంతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ఎమ్మెల్యే కడియంను కలిసిన ధన్వంతి

స్టేషన్‌ఘన్‌పూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలుగా ఎంపికైన లకావత్ ధన్వంతి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కడియం, ధన్వంతిని శాలువాతో సత్కరించి స్వీటు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. కడియం మాట్లాడుతూ జిల్లాలో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, అన్ని వర్గాల నాయకులను కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. జిల్లాలో పార్టీ పటిష్టానికి తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కడియం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు జూలకుంట్ల శిరీష్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, నాయకులు అన్నం బ్రహ్మారెడ్డి, మంచాల ఎల్లయ్య, గుడి వంశీధర్ రెడ్డి, కొలిపాక సతీష్, తెల్లాకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



రుద్రయ్య (ఫైల్)

జఫర్‌గడ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలలో మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కూనూరులో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామారావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాగంటి రుద్రయ్య(57)కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఇదీ విషయమై రుద్రయ్యను భార్య కోమల బుధవారం రాత్రి మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవజరగడంతో మనస్తాపం చెందిన రుద్రయ్య అదే రోజు రాత్రి పురుగుల మందు తాగి కింద పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సాంబరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

- ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు - వాజేడు వద్ద ఘటన



తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయురాలు బాలసంధ్య

వాజేడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఇసుక లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులకు గాయాలైన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధ్యాయులు నిరంజన్, బాలసంధ్య ఉదయం విధులకు వెళ్తున్న క్రమంలో ధర్మవరం-చెరుకూరు మార్గం మధ్యలో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో నిరంజన్‌కు స్వల్పగాయాలు కాగా బాలసంధ్య తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు వారిని వైద్యం కోసం ఏటూరునాగారం తరలించారు. ఈ రహదారిలో ఇసుక లారీలతో ఇబ్బందులు ఎదురవు తున్నాయని, తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పోలీ సులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంపై పేరూరు పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

పట్టాల పంపిణీకి వేళాయె..

- నేడు వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం
- ఓవరాల్ టాపర్‌గా సీఎస్ఈ విద్యార్థి శ్రీసత్య నవీన్
- 1913 మందికి పట్టాలు, 14 మందికి బంగారు పతకాలు
- ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా ఎం.డి. ఆనంద రామమూర్తి
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన క్యాంపస్



స్నాతకోత్సవంలో పట్టాలు అందుకునేందుకు వచ్చిన విద్యార్థులతో నిట్‌లో నెలకొన్న సందడి

హనుమకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్ 23వ స్నాతకోత్సవం శుక్రవారం జరగనుంది. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. క్యాంపస్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్ (ఏఎల్‌సీ)లో జరిగే వేడుకకు ఈ సారి ముఖ్య అతిథిగా మైక్రాన్ ఇండియా, మైక్రాన్ టెక్నాలజీ ఆపరేషన్ ఇండియా ఎల్ఎల్‌పీ వైస్ ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద రామమూర్తి హాజరవుతున్నారు. గౌరవ అతిథులుగా సియాంట్ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్, మాజీ మేనేజింగ్ డైరెక్టర్, ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ రూర్కీ బోర్డ్ ఆఫ్ గవర్నర్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (డీఆర్‌డీ) సెక్రెటరీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో) చైర్మన్ కూడా అయిన డాక్టర్ వి.సమీర్ కామత్ హాజరవుతున్నారు.

1913 మందికి పట్టాలు

నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి గురువారం బోస్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సారి మొత్తం 1913 మంది విద్యార్థులకు పట్టాలను అందజేయనున్నట్టు తెలిపారు. వీరిలో 953 మంది బీటెక్, 556 మంది ఎంటెక్, 149 మంది ఎంఎస్‌సీ, 38 మంది ఎంబీఏ, 56 మంది ఎంసీఏ విద్యార్థులు, 142 మంది పీహెచ్‌డీ స్కాలర్లు, 19 మంది బీఎస్ సీ, బీఎస్‌సీ (హానర్స్), ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

ఉత్తమ బీటెక్ ప్రాజెక్టు అవార్డు విజేత
మీర్ రహమాన్ (ఎంటెక్, సస్టేనబుల్ ఎనర్జీ జనరేషన్ అండ్ స్టోరేజీ టెక్నాలజీస్)

బెస్ట్ ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు విజేత
ఆయేషా డాంగే (ఎంటెక్, సస్టేనబుల్ ఎనర్జీ జనరేషన్ అండ్ స్టోరేజ్ టెక్నాలజీస్)

ఉత్తమ పీహెచ్‌డీ థీసిస్ అవార్డు విజేత
డాక్టర్ నిఖిల్ భరత్ (మెకానికల్ ఇంజనీరింగ్)

14 మందికి బంగారు పతకాలు

ప్రతీ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో బీటెక్‌లో టాపర్‌గా నిలిచిన 14 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈసారి ముగ్గురు విద్యార్థులు డైరెక్టర్ గోల్డ్ మెడల్స్ అందుకోబోతున్నట్టు తెలిపారు. వీరిలో ఓవర్ ఆల్ టాపర్‌గా పాలచర్ల శ్రీ సత్య నవీన్ నిలిచారు. ఆయన అన్ని బీటెక్ ప్రోగ్రాముల్లో అత్యున్నతంగా నిలిచి కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో ఇన్‌స్టిట్యూషనల్ గోల్డ్ మెడల్ (డైరెక్టర్స్ గోల్డ్ మెడల్) అందుకోబోతున్నారన్నారు. దీంతో పాటు ఆయన రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్‌ను కూడా స్వీకరించబోతున్నారు. అలాగే అన్ని ఎంటెక్ ప్రోగ్రాములలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా కొండ సౌష్య కూడా డైరెక్టర్ గోల్డ్ మెడల్ స్వీకరించనున్నట్టు చెప్పారు. ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్‌సీ కోర్సుల్లో కూడా అందరికన్నా టాపర్‌గా నిలిచిన రోహన్ గుప్తాకు కూడా డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. బీటెక్ ప్రాజెక్టు అవార్డును మీర్ రహమాన్, ఎంటెక్ డిసెర్టేషన్ అవార్డు ఆయేషా దాంగే, పీహెచ్‌డీ థీసిస్ అవార్డు డాక్టర్ నిఖిల్ భరత్ అందుకోబోతున్నట్టు వెల్లడించారు.



మా అమ్మ ప్రోత్సాహం మరువలేను

వరంగల్ నిట్‌లో బిటెక్ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)లో ఓవరాల్ టాపర్‌గా డైరెక్టర్ గోల్డ్ మెడల్ (ఇన్‌స్టిట్యూషన్)తో పాటు అందరికన్నా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నందుకు రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ లభించినందుకు ఆనందంగా ఉంది.ఈ విజయంలో మా అమ్మ సునీత దేవి ప్రోత్సాహం ఎంతో ఉంది. మాది తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం అచ్యుతాపురం గ్రామం. రైతు కుటుంబం.

\- పాలచెర్ల శ్రీ సత్య నవీన్, రెండు బంగారు పతకాల విజేత



గోల్డ్‌మెడలిస్టులతో నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

ఇద్దరికి అత్యున్నత పురస్కారాలు

వరంగల్ నిట్ చరిత్రలో మొదటి సారిగా ఇద్దరికి అత్యున్నత పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్టు డైరెక్టర్ తెలిపారు. సాయుధ దళాల కోసం దేశావాళీ రక్షణ వ్యవస్థలను, అధునాతన సాంకేతికతలను అభివృద్ధి చేయడంలో విశేషంగా కృషి చేసినందుకు గుర్తింపుగా డీఆర్‌డీవో చైర్మన్ వి సమీర్ కామత్‌కు గౌరవ డాక్టరేట్‌ను, అలాగే దేశానికి భద్రత, సస్టేనబుల్ ఎనర్జీ ట్రాన్స్‌ఫార్మేషన్‌లో కీలక భూమిక పోషించినందుకుగాను గుర్తింపుగా ఎన్. వేణుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (హానరీస్ కాసా) ప్రదానం చేస్తున్నట్టు తెలిపారు.

డైరెక్టర్ గోల్డ్ మెడల్ విజేతలు :

- పాలచర్ల శ్రీ సత్య నవీన్, బీటెక్ (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)
- కొండా సౌష్య, ఎంటెక్ (పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్)
- రోహన్ గుప్తా ఎంఎస్‌సీ (ఆర్గానిక్ కెమిస్ట్రి)

రోల్ ఆఫ్ హానర్ గోల్డ్ మెడల్ విజేతలు:

- పెరవాలి సుధీర్ కుమార్ (సివిల్ ఇంజనీరింగ్)
- ఉకాలే అశుతోష్ అనిల్ కుమార్ (ఎలక్ట్రికల్ అండ్ ఎకానమిక్స్ ఇంజనీరింగ్)
- దేశ్‌పాండే శ్రేయాస్ (మెకానికల్ ఇంజనీరింగ్)
- మండపాక వెంకట శివ శ్రీమంత్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్)
- కరుపర్తి నాగసాయి కార్తీక్ (మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్)
- పాడి తేజేశ్వర్ రావు (కెమికల్ ఇంజనీరింగ్)
- పాలచర్ల శ్రీ సత్య నవీన్ (కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్)
- శానిక నిఖిల్ కన్‌హేర్ (బయోటెక్నాలజీ).



దేవస్థానంలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్



కూల్చివేస్తున్న దేవస్థానం పరిసరాల్లోని షాపింగ్‌కాంప్లెక్స్

జాతర సమీపిస్తున్నా అదే తీరు

- మేడారంలో మెరుగుపడని సౌకర్యాలు
- ముందస్తు మొక్కులకు వస్తున్న భక్తులకు ఇబ్బందులు

తాడ్వాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి తరలివస్తున్న భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మహాజాతర సమీపిస్తున్నా ఇంకా సౌకర్యాలు మెరుగుపడలేదు. దీంతో ముందస్తుగా వనదేవతలను దర్శించుకోవడానికి వస్తున్న వారు సమస్యలతో సతమతం కావాల్సి వస్తోంది. ముఖ్యంగా ఇక్కడ తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఓ భక్తుడు ఇటీవల బహూకరించిన ఆర్వో వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. ఈ ప్లాంట్ కోసం దేవాదాయ శాఖ అధికారులు రూ.3లక్షలు ఖర్చు చేసి బోరు బావి, షెడ్ నిర్మించారు. ఈ ప్లాంట్ కొన్ని రోజులు ఉపయోగంలోనే ఉంది. సంవత్సర కాలంగా అధికారులు, సిబ్బంది పటించుకోకపోవడంతో రిపేర్‌కువచ్చింది. 2026 మహా జాతరకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో ముందస్తుగావస్తున్న భక్తులకు నీటిసౌకర్యం కరువైంది.తల్లుల దర్శనం అయ్యేంత వరకు చుక్క నీరు కూడా తాగకుండా ఉండాల్సి వస్తోంది.

షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత

మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా దేవస్థానం పరిసరాల్లోని షాపింగ్ కాంప్లెక్స్‌ను కూల్చి వేస్తున్నారు. దీంతో చిరు వ్యాపారులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 2018లో ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రూ. 4కోట్లతో 27 షాప్‌లను నిర్మించారు. మేడారం దేవస్థానం వందల సంవత్సరాలు శాశ్వతంగా నిలిచేలా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్ నిర్మాణాలకు అడ్డుగా ఉందని దీన్ని తొలగించారు. దీంతో తాము జీవనోపాధిని కోల్పోయామని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయంగా శాశ్వతంగా అధిక సంఖ్యలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి తరలివస్తున్న భక్తులు అక్కడి అటవీ ప్రాంతంలో విడిది చేస్తుంటారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఆ ప్రదేశమంతా వ్యర్థాలతో నిండిపోయాయి. భక్తులు చెట్ల కింద శుభ్రం చేసుకొని సేద తీరాల్సి వస్తోంది. మేడారం నుంచి తాడ్వాయి వెళ్లే రహదారిలో సుమారు ఐదు కిలో మీటర్ల మేర చెత్త, వ్యర్థాలు పేరుకు పోయాయని, అయినా అధికారులు పారిశుధ్య పనులు చేపట్టడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యర్థాలను పాడి పశువులు, దుక్కిటెద్దులు, పందులు, మేకలు, గొర్రెలతోపాటు వణ్యప్రాణులు తింటూ మృత్యువాత పడుతున్నాయని అంటున్నారు. వెంటనే మేడారం పరిసరాలోని అటవీ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పనులు ప్రారంభం

మహాజాతర నేపథ్యంలో భక్తకోటికి సౌకర్యాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో పలు పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యంగా భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాల కోసం టెండర్లను ఆహ్వానించగా ఆయా పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

ముందస్తుగా తరలివస్తున్న భక్తులు

తాడ్వాయి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రద్దీ పెరుగుతోంది. వనదేవతలకు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు ముందస్తుగా తరలివస్తున్నారు. వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చి సమ్మక్క- సారలమ్మలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో గురువారం 10వేల మందికి పైగా తరలివచ్చారని దేవస్థానం అధికారులు తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మహా జాతర జరగనుంది. ఈ క్రమంలో భక్తులు ముందస్తుగా కుటుంబ, బంధుమిత్రులతో కలిసి వచ్చి దేవతలకు మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం మేడారం గ్రామ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో విడిది చేసి సాయంత్రానికి తిరుగు ప్రయాణం చేశారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



01: మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మీడియా సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ గురువారం ప్రారంభించారు. మీడియా సెంటర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల సంఘం నియమ నిబంధనలు జిల్లాలో మండలాల వారీగా మూడు విడుతల్లో జరుగనున్న గ్రామ పంచాయతీల ఎన్నికల షెడ్యూల్ వివరాలు, ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాల వివరాలు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం సకాలంలో ప్రచార ప్రకటనలకు సంబంధించిన అనుమతులు మంజూరి చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులను గమనిస్తూ ఉండాలని ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. మీడియా సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించి డీఆర్‌డీవో మేన శ్రీను, ఇన్‌చార్జి డీపీఆర్‌వో అయూబ్‌అలీలు కలెక్టర్‌కు వివరించారు.

టీఈ-పోల్ యాప్‌లో సమస్త సమాచారం

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల సమాచారాన్ని సులభంగా అందించేందుకు రూపొందించిన టీఈ-పోల్ (తెలంగాణ ఎలక్షన్స్) మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల వివరాలు, సంబంధిత సమాచారాన్ని తెలియపరిచేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. గూగుల్ స్టోర్ నుంచి టీఈ-పోల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా ఓటర్లు తమ పోలింగ్ కేంద్రం వివరాలు, ఓటర్ స్లిప్ నమోదు సమాచారం తదితర ముఖ్య సమాచారం సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటెయ్యాలని కోరారు. ప్రతి ఒక్కరూ టీఈ-పోల్ యాప్‌ను ఉపయోగించడంతో పాటు ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.



టీఈ-పోల్ యాప్ చిత్రం

నామినేషన్ వేస్తున్నారా...

పంచాయతీ అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలివే...

వరంగల్ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. నామినేషన్లకు మూడు రోజులు మాత్రమే గడువు ఉంది. ఎన్నికల అధికారులు నిబంధనలకు అనుగుణంగా పలు రకాల ధ్రువ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. వాటిని ముందుగానే సిద్ధం చేసుకుని తీసుకెళ్లాలి. ఈ విషయం తెలియక పోటీ చేయడానికి ఉత్సాహంగా ముందుకెళ్లినా సరైన పత్రాలు సమర్పించకుంటే పోటీ నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. సర్పంచ్, వార్డు మెంబర్‌గా పోటీ చేయాలంటే నామినేషన్ వేసే సమయానికి ముందు అభ్యర్థులు తెలుసుకోవాల్సినవి/ చూసుకోల్సిన పత్రాల వివరాలు..

- పోటీ చేసే అభ్యర్థి వయస్సు 21 సంవత్సరాలు ఉండాలి.
- సంబంధిత ఓటరు లిస్టులో ఓటరుగా నమోదై ఉండాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రం జతపరచాలి.
- నేర చరిత్ర, స్థిర, చరాస్తుల వివరాలు, విద్యార్హతలతో కూడిన అఫిడవిట్, ఇద్దరు సాక్షులతో సంతకాలు పెట్టించి ఇవ్వాలి.
- ఎన్నికల ఖర్చు లెక్క అప్పగిస్తానని డిక్లరేషన్ ఇవ్వాలి.
- ఏ స్థానం నుంచి పోటీ చేస్తున్నారో.. ఆ స్థానం నుంచి ఓటరు మాత్రమే ప్రతిపాదకుడిగా ఉండాలి.
- అభ్యర్థులు ఎన్నికల ఖర్చు సర్పంచ్‌లకు రూ. 1,50,000, వార్డు మెంబర్లకు రూ.30,000 పరిమితి ఉంది.

నామినేషన్ పత్రంలో...

పార్ట్ 1లో ప్రతిపాదకుడు, పార్ట్ 2లో అభ్యర్థి, పార్ట్ 3లోనూ అభ్యర్థి, పార్ట్ 4లో ఆర్వో, పార్ట్ 5లో (రిజెక్టెడ్ నామినేషన్స్ రీజన్స్)లో ఆర్వో, పార్ట్ 6లో (రశీదు)లో ఆర్వో, అఫిడ్‌విట్‌లో ఇద్దరు సాక్షుల సంతకాలు ఉండాలి. అలాగే ఖర్చు డిక్లరేషన్‌లో అభ్యర్థి సంతకం ఉండాలి.

నామినేషన్ పత్రంతో జత పరచాల్సినవి

నాలుగు ఫొటోలు, నామినేషన్ డిపాజిట్ రశీదు (జిరాక్స్), స్వీయ ప్రకటన (అఫిడవిట్), డిపాజిట్, పంచాయతీ నుంచి నో డ్యూ సర్టిఫికెట్, బ్యాంక్ ఖాతా జిరాక్స్ ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్‌లు పోటీ చేసేవారివి, బలపరిచే వారివి కుల ధృవీకరణ పత్రాలు.

నామినేషన్ డిపాజిట్ వివరాలు

పదవి పేరు	జనరల్ అభ్యర్థులు	ఎస్సీ ఎస్టీ, బీసీ అభ్యర్థులు
సర్పంచ్	రూ. 2000	రూ. 1000
వార్డ్ మెంబర్	రూ. 1000	రూ. 500

'కాళోజీ' వర్సిటీలో అక్రమ నియామకం

నెలకు రూ. 90వేల వేతనం

వరంగల్ మెడికల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో సివిల్ ఇంజనీర్ నియామకాన్ని అక్రమంగా చేపట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నెలకు రూ. 90వేలు చెల్లించే విధంగా నియామకం చేపట్టినట్టు తెలుస్తోంది. విశ్వవిద్యాలయంలో ఉద్యోగాల భర్తీ చేయాలంటే ప్రభుత్వ అనుమతితో పాటు నోటిఫికేషన్ జారీ చేయాలి. కానీ ఇందుకు విరుద్ధంగా నెల రోజుల క్రితం విశ్వవిద్యాలయ కీలక అధికారి ఓ సివిల్ ఇంజనీర్‌ను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించినట్లు తెలుస్తోంది. ఇతడికి ప్రతీ నెల రూ.90వేల వేతనం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం. సివిల్ ఇంజనీర్ గత నెల రోజులుగా ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి పీఏ నంటూ చెప్పుకొంటున్నట్లు ఉద్యోగులు చెబుతున్నారు.

ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

వరంగల్ మెడికల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో పొరుగు సేవల ఉద్యోగి (ఔట్ సోర్సింగ్)ని సర్వీస్ నుంచి తొలగించారు. ఈ మేరకు ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి గురు వారం ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీకి లేఖ రాశారు. బుధవారం రాత్రి గాయపడ్డ రోగికి వెంట్రుకలు తొలగించేందుకు బార్బర్ శ్రీనివాస్ డబ్బులు డిమాండ్ చేశారు. ఈ తతంగాన్ని రోగి బంధువులు వీడియోలో బంధించి సూపరింటెండెంట్‌కు సాక్ష్యంతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. వెంటనే సదరు బార్బర్ శ్రీనివాస్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

సర్పంచ్, వార్డు ఎన్నికల వ్యయ వివరాలు ఇవే..

మహబూబాబాద్ రూరల్, నవంబరు27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు అభ్యర్థుల ఎన్నికల్లో నిబంధనావళి ప్రకారం ఖర్చుచేసే వివరాలను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ప్రకటించారు. 2011 జనాభా ప్రకారం 5 వేల పైగా జనాభా ఉన్న గ్రామ సర్పంచ్ అభ్యర్థులు ఇప్పటి పంచాయతీ ఎన్నికల్లో రూ.2.50 లక్షలు ఖర్చు చేయవచ్చన్నారు. 5 వేలోపు జనాభా పంచాయతీల్లో రూ.1.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధన ఉంది. ఇక వార్డుల విషయానికొస్తే 5వేల జనాభా కంటే ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసే అభ్యర్థి రూ.50వేలు, 5వేల లోపు జనా భా ఉన్న గ్రామాల్లో వార్డు సభ్యుడిగా పోటీచేసే వ్యక్తి రూ.30 వేలు ఖర్చు చేసుకోవాలని ఎన్నికల సంఘం నిబంధనలు విధించింది.

'బ్రాండ్' మారింది గురూ..!

చిన్నబోతున్న చీప్ లిక్కర్



లింగాలఘణపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లు దిగువ శ్రేణి వర్గం చేరదీసిన 'చీప్' లిక్కర్ గ్రామపంచాయతీ ఎన్నికల పరంపరలో పడి చిన్నబోతోంది. పొద్దుందాకా కాయకష్టం చేసిన జనం సాయంత్రం కాగానే శరీర అలసటను మర్చిపోయేందుకు ఊరి పొలిమేరలో అందుబాటులో ఉన్న బెల్ట్‌షాప్‌లో దూరి కాసింత చీప్ లిక్కర్‌ను పుచ్చుకునే బడుగులు ఇప్పుడు బ్రాండ్ మార్చి కొత్తదనపు రుచులను ఆస్వాదిస్తున్నారు. ఎలక్షన్ల జోరులో చీప్ లిక్కర్ జోలికెళ్లి చీప్ అవ్వడమెందుకు అనుకుంటున్నారో ఏమో గానీ.. నిన్న మొన్నటి దాకా తక్కువ ధరల మద్యం సేవించిన వాళ్లంతా ఇప్పుడు బ్రాండ్ మార్చి ఖరీదైన మద్యానికే జైకొడుతున్నారు.

జిల్లాలో మొదటి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో గురువారం నామినేషన్ల పర్వం మొదలు కాగా అభ్యర్థుల వెంట వచ్చిన అనుచరగణమంతా చౌకధరల మద్యానికి పాతరేసి ఖరీదైన బ్లెండర్ ప్రైడ్, సిగ్నేచర్, 100పైపర్, టీచర్స్ మద్యాన్ని సెలెక్ట్ చేసుకుంటుడం గమనార్హం. సొమ్ము మనది కాకపోతే మనకంటే సోగ్గాడు ప్రపంచంలోనే లేడన్నట్లు తయారవుతున్నారు.

(5వ పేజీ తరువాయి)

ఎవరి ఎ'జెండా' వారిదే...

ఖర్చులు, పోల్‌మేనేజ్‌మెంట్ విషయంలో ఆ పార్టీలో స్పష్టత లేదనే ప్రచారం జరుగుతోంది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా ఓట్లు పోలైన పరకాలతో పాటు భూపాలపల్లి, వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గాలపై కమలం పార్టీపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

ఎజెండా ఇలా..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లవుతున్న నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలు కావటంలో ఆ పార్టీ ప్రజాతీర్పును తమకు అనుకూలంగా వచ్చేలా ప్రయత్నాలు చేస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు గ్యాస్ సబ్సిడీ, 200యూనిట్ల ఫ్రీ విద్యుత్ తదితర సంక్షేమ పథకాలతో తమను ప్రజలు ఆదరిస్తారనే ఆశతో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నాయి. సన్న బియ్యం, సన్న వడ్లకు రూ.500 సబ్సిడీ కూడా ఓట్లు రాలుస్తాయనే ధీమాతో కాంగ్రెస్ ఉంది. అన్నింటికి మించి ఇందిరమ్మ చీర కానుకతో పల్లెపోరులో మహిళలు మద్దతుగా నిలుస్తారని కాంగ్రెస్ అంచనా వేస్తోంది.

ఇక ప్రతిపక్షాలు ప్రధానంగా బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. కామారెడ్డి డిక్లరేషన్‌లో 42శాతం రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌ను నిలదీస్తున్నాయి. బుధవారం వరంగల్ పర్యటనలో కేటీఆర్ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసం చేశారని ధ్వజమెత్తారు. 42శాతం అని హామీ ఇచ్చి, కనీసం 17శాతం కూడా రిజర్వేషన్లు బీసీలకు ఇవ్వటం లేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

ఎంతో కీలకం

గ్రామ పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారగా, బీఆర్‌ఎస్‌కు జీవన్మరణ సమస్యగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల కావస్తున్న క్రమంలో జరుగుతున్న ఎన్నికలు కావటంతో గెలుపు ఆ పార్టీకి ప్రతిష్ఠాత్మకంగా మారింది. ప్రభుత్వం, ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు ఇచ్చే తీర్పుగా భావించే అవకాశం ఉంది. దీంతో మెజార్టీ సర్పంచ్ స్థానాలను గెలవటం ఆ పార్టీకి సవాల్‌గా మారింది. బీఆర్‌ఎస్‌కు కూడా స్థానిక ఎన్నికలు జీవన్మరణ సమస్యగానే మారుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటమి తరువాత వరుసగా వస్తున్న అన్ని ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొంది. ఉమ్మడి జిల్లాలో బలమైన నేతలు, క్యాడర్ ఉన్నప్పటికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమిని గులాబీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే వరంగల్, నల్గొండ,ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఓటమి గులాబీ తమ్ముళ్లను నిరాశకు గురి చేసింది. ఆ తరువాత రాష్ట్రంలో పలుచోట్ల జరిగిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో వరుస ఓటములు గులాబీని కుంగతీశాయి. దీంతో సర్పంచ్ ఎన్నికల్లో గెలిస్తేనే క్యాడర్ కారులోనే ప్రయాణించే అవకాశం ఉందని, లేదంటే ప్రత్యామ్నాయం చూసుకునే అవకాశం లేకపోలేదనే ఆందోళన గులాబీ నేతల్లో వ్యక్తం అవుతోంది. సర్పంచ్ ఎన్నికల్లో గెలుపు ఆ పార్టీకి జీవన్మరణంగా మారిందనే టాక్ వినబడుతోంది. ఇక బీజేపీ గతంలో కూడా గ్రామాల్లో పెద్దగా సర్పంచ్‌లను గెలిపించుకున్న దాఖలాలు లేవు. అయితే ఈసారి ఉనికి చాటుకునే ప్రయత్నాలు చేస్తోంది.

సీపీఐ అభ్యర్థులను ఆదరించండి

● జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి



సర్పంచ్ అభ్యర్థులను ప్రకటిస్తున్న అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిత్యం పేదప్రజల సమస్యలపై ఉద్యమించే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అభ్యర్థులను ఆదరించాలని ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని వీరభవన్‌లో మహబూబాబాద్ మండలం ముడుపుగల్ గ్రామసర్పంచ్ అభ్యర్థిగా తండా సందీప్, మల్యాలధామ్యతండా సర్పంచ్ అభ్యర్థిగా బానోత్ లింగ్యానాయక్‌లను గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యఉంటూ సమస్యలపై ఉద్యమించే వారిని గెలిపిస్తే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఆలోచించాలని కోరారు. వంద సంవత్సరాల పోరాట చరిత్ర కలిగిన సీపీఐ అభ్యర్థులను ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకుంటే వారు పంచాయతీ పాలకమండళ్ల సమావేశాల్లో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తారని తెలిపారు. పొలగాని శ్రీనివాస్, తండా సతీష్, తేజావత్ వినయ్, విజయ్, శేఖర్, గురుస్వామి, సాయి, సుమన్, శ్యామ్, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, రవి, ప్రవీణ్, శంకర్, శ్యాంప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌కు ఉజ్వల్ ఎంపిక

కేసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహించే ఎస్‌జీఎఫ్‌ఐ అండర్ 14 బాస్కెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గుండగాని ఉజ్వల్ ఎంపికైనట్లు హెచ్‌ఎం బండారు నరేందర్, పీడీ కొప్పుల శంకర్ గురువారం తెలిపారు. సంగారెడ్డిలో ఈనెల 28 నుంచి 30 వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి అసోసియేషన్ బాస్కెట్‌బాల్ పోటీలకు కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బానోత్ అలేఖ్య ఎంపికైనట్లు హెచ్‌ఎం బందెల రాజు, పీడీ కొమ్ము రాజేందర్‌లు తెలిపారు. ఇరువురు ఇటీవలె మహబూబాబాద్‌లో వేర్వేరుగా నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభకనబర్చడంతో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు.

అశాస్త్రీయంగా విద్యాకమిషన్ నివేదిక

● టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్

ఇనుగుర్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యాకమిషన్ నివేదికను ప్రభుత్వ పెద్దల మెప్పుకోసం అసంబద్ధంగా, అశాస్త్రీయంగా తయారు చేశారని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాష్టి రమేష్ ఆరోపించారు. ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో గురువారం ఆ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి అర్థరహితంగా కమిషన్ సిఫారసులు చేసిందని అన్నారు. రాష్ట్రంలోని 23 శాతం బడుల్లో ఒక్క ఉపాధ్యాయుడే బోధిస్తున్నారని, పాఠశాలలో అనేక సమస్యలున్నప్పటికీ వాటిని కమిషన్ ప్రస్తావించలేదని తెలిపారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి కదిరె ప్రభాకర్, శైలజ, సాగర్, మల్లయ్య పాల్గొన్నారు.

నామినేషన్ కోసం ఉరుకులు, పరుగులు

● కుల ధ్రువీకరణ పత్రానికి మీసేవ కేంద్రాలకు..

● అందుబాటులో లేని బ్యాంకు 'కొత్త ఖాతా'

● కొన్ని జీపీల్లో నల్లాపన్నులు చెల్లించాలని మెలిక



అభ్యర్థుల సందడి లేని కల్వల గ్రామపంచాయతీ కార్యాలయం

కేసముద్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో తొలిరోజు నామినేషన్ల కోసం అభ్యర్థులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ఈనెల 25న సాయంత్రం నోటిఫికేషన్ విడుదలై ఒక్కరోజు వ్యవధి ఇచ్చి 27 నుంచే నామినేషన్ల స్వీకరణ చేపట్టారు. ఒక్కరోజులోనే అభ్యర్థులకు అవగాహన లేకపోవడంతో పాటు నామినేషన్ కోసం అవసరమైన పత్రాలు అందుబాటులో లేక సతమతమవుతున్నారు.

మూడు రోజులపాటే నామినేషన్ల స్వీకరణ ఉండడంతో పలు గ్రామాల్లో ఆయా పార్టీల తరఫున అభ్యర్థుల ఎంపిక కోసం జోరుగా చర్చలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల ఉపసంహరణ సమయం వరకు అభ్యర్థిని నిర్ణయించే అవకాశం ఉండడంతో తొలుత నామినేషన్ దాఖలు చేయాలని పార్టీ అధినాయకత్వం సూచనలు పంపినట్లు తెలుస్తోంది. నామినేషన్ స్వీకరణ కేంద్రాల్లో ఉచితంగానే నామినేషన్ దరఖాస్తులను రిటర్నింగ్ అధికారులు అభ్యర్థులకు అందజేస్తున్నారు. ఈ దరఖాస్తు ఫారంలకు డిపాజిట్ డబ్బుల రశీదు, గ్రామపంచాయతీ నుంచి ఎలాంటి బకాయిలు లేవని 'నోడ్యూ సర్టిఫికెట్', కులధ్రువీకరణపత్రం, అభ్యర్థితోపాటు ప్రతిపాదకుల ఆధార్, ఓటరు కార్డులు జిరాక్స్‌లను జతచేయాల్సిఉంటుంది. అలాగే ఫారంలోనే స్వీయ ధ్రువీకరణ, వ్యయ ధ్రువీకరణల కోసం అభ్యర్థి సంతకాలు, ప్రతిపాదకుని వివరాలతో సంతకాలు ఉండాలి. అభ్యర్థి, ప్రతిపాదకులు తప్పనిసరిగా గ్రామ ఓటరు జాబితాలో ఉండాలి.

కొత్త బ్యాంకు ఖాతాతో కంగారు...

నామినేషన్ దాఖలు చేసే దరఖాస్తుతోపాటు బ్యాంకు ఖాతా జిరాక్స్‌ను జతపర్చాల్సిఉండగా చాలామంది అభ్యర్థులు తమ బ్యాంకు ఖాతాను తీసుకువెళ్లగా అవి చెల్లవని చెబుతున్నారు. ఎన్నికల వ్యయం కోసమే కొత్త బ్యాంకు ఖాతాను తెరిచి ఆ జిరాక్స్‌ను జతపర్చాలని చెబుతుండడంతో సంబంధిత బ్యాంకులకు పరుగులు తీస్తున్నారు. అయితే అప్పటికే ఆ బ్యాంకులో ఖాతా ఉండడంతో మరో ఖాతా ఇవ్వడం కుదరని పలువురు అభ్యర్థులను బ్యాంకు అధికారులు తిప్పిపంపారు.

ఈ క్రమంలో ఖాతాదారులకు ఎన్నికల ఖర్చు నిర్వహణ కోసం ప్రత్యేక ఖాతాను ఇవ్వాలని గురువారం మధ్యాహ్నం జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ నుంచి అన్ని బ్యాంకులకు ఉత్తర్వులను పంపించారు. జనరల్ స్థానాలు మినహా బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వు స్థానాల్లో తప్పనిసరిగా మీసేవ నుంచి జారీ అయిన కులధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు జతచేయాల్సిఉండడంతో పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు మీసేవ సెంటర్ల వద్దకు పరుగులు పెట్టారు. దరఖాస్తు చేసిన రోజే వెంటనే జారీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మరోవైపు కొన్ని గ్రామపంచాయతీల్లో ఇంటిపన్నుతోపాటు ఐదేళ్ల నల్లాపన్నులు కూడా చెల్లిస్తేనే 'నోడ్యూ సర్టిఫికెట్' ఇస్తామని మెలికపెట్టడంతో అభ్యర్థులు కంగారెత్తుతున్నారు. ఏదేమైనా అవగాహన లోపం, పత్రాలు అందుబాటులో లేక తొలిరోజు నామినేషన్లు అరకొరగా దాఖలైనట్లు తెలుస్తోంది.

ప్రజాప్రభుత్వంతోనే పేదల సమస్యలకు పరిష్కారం

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్, జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఉమ, కార్యకర్తలు

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వంతోనే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గూడూరు గ్రామపంచాయతీ అభ్యర్థిగా వాంకుడోతు సునీత కొమ్మాల్‌నాయక్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. గూడూరు అంగడి సెంటర్ నుంచి జీపీ కార్యాలయం వరకు మహిళలు, కార్యకర్తలతో భారీర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉమ, మాజీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం వాంకుడోతు సునీతకొమ్మాల్‌నాయక్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో ఎలాంటి గ్రూప్ రాజకీయాలు లేవని స్పష్టం చేశారు. కష్టపడి జెండా మోసి పనిచేసిన నిజమైన కార్యకర్తలకే సర్పంచ్ అవకాశం ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షులు చిట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రమేష్‌చందర్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాల్‌నాయక్, బీరం శ్రీపాల్‌రెడ్డి, మాదాసు రమేష్, ఓర్సు బిక్షపతి, రాసమల్ల యాకయ్య, చంటి స్వామి, ఎలమందల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్ల భాషపై పట్టు సాధించాలని ఎంఈవో జె.రవికుమార్ అన్నారు. గూడూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆంగ్లభాష ఒలంపియాడ్ అండ్ ఎడ్యుకేట్ పరీక్ష పోటీలను నిర్వహించారు. ఈ పరీక్షలు సీనియర్, జూనియర్స్ విభాగంలో నిర్వహించారు. సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతి మచ్చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఓంసాయి, ఎండి.షాహీద్, ఎడ్యుకేట్ టాక్ ఉపన్యాస విభాగం జూనియర్‌లో జడ్పీహెచ్ఎస్ అయోధ్యపురానికి చెందిన లాస్య, సీనియర్ విభాగంలో గూడూరు జడ్పీహెచ్ఎస్ బాలురకు చెందిన ప్రథమ బహుమతి కె.యశ్వంత్ రాజ్, స్ట్రీమ్-2 ఆంగ్ల ఒలంపియాడ్‌లో కేజీబీవీ బ్రహ్మణపల్లి నుంచి ఎ.కృప ప్రథమబహుమతి పొందారు.

ఇన్‌స్పైర్‌కు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఎగ్జిబిట్



లోకేష్‌ను అభినందిస్తున్న డైరెక్టర్ ప్రమోద్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే రాష్ట్ర ఇన్‌స్పైర్ పోటీలకు మానుకోటలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి లోకేష్ ప్రదర్శించిన ఎగ్జిబిట్ ఎంపికైనట్లుస్కూల్ డైరెక్టర్ ప్రమోద్ రెడ్డి తెలిపారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్‌లో ఈనెల 26, 27 తేదీల్లో జరిగిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ (వైజ్ఞానిక ప్రదర్శన)లో ఏడో తరగతి విద్యార్థి లోకేష్ ప్రదర్శించిన మ్యాథమెటికల్ రిక్రియేషనల్ మోడల్ అనే ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ ఎగ్జిబిట్‌ను త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శించనున్నారు.

లోకేష్‌ను, గైడ్ టీచర్ ఫరహత్ భానును స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ప్రమోద్‌రెడ్డి అభినందించారు.

మొదలైన నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)

ఎంపీడీవో క్రాంతి తెలిపారు. అర్పనపల్లి, కల్వల, తాళ్లపూసపల్లి, అన్నారం సర్పంచ్ స్థానాలకు మూడుచొప్పున వెరసీ 12 మంది నామినేషన్లు వేశారు. ఉప్పరపల్లి, సప్పిడిగుట్టతండా, క్యాంపుతండా, పీక్లాతండా, నారాయణపురం, పెద్దమోరీతండా, ధర్మారంతండా, బిచ్యానాయక్ తండా, పెనుగొండ జీపీలకు ఒక నామినేషన్ చొప్పున వెరసీ 09 నామినేషన్లు దాఖలయ్యాయి, ఇక వార్డులకు గాను నాలుగు నామినేషన్లు వచ్చాయి.

● గూడూరు : మండలంలో సర్పంచ్ స్థానాలకు 28 మంది, వార్డులకు 18 మంది నామినేషన్ దాఖలు చేశారు. జంగుతండా సర్పంచ్ స్థానానికి-2, గోవిందాపురం-3, మచ్చర్ల-3, బొల్లెపల్లి-3, నాయకపల్లి-2, రాజన్‌పల్లి-2, గూడూరు-1, మర్రిమిట్ట-4, బొద్దుగొండ-1, పోనుగోడు-1, వెంగంపేట-2, గుండెంగ-1, హరిశ్చంద్రునితండా-2, గాజులగట్టులో ఒకటి నామినేషన్లు దాఖలు చేశారు.

● ఇనుగుర్తి : మండలంలో సర్పంచ్ స్థానాలకు 14 నామినేషన్లు, వార్డులకు గాను 05 నామినేషన్లు దాఖాలైనట్లు ఎంపీడీవో హరిప్రసాద్ తెలిపారు. ఇనుగుర్తి సర్పంచ్ స్థానానికి రెండు, చిన్నా నాగారం-3, బీక్యాతండా-1, రాముతండా-1, కోమటిపల్లి-1, చిన్నముప్పారం-3, పెద్దతండా-2, లక్ష్మీపురం సర్పంచ్ స్థానానికి ఒక నామినేషన్ పడింది.

● నెల్లికుదురు : మండలంలో సర్పంచ్ స్థానాలకు 33 నామినేషన్లు, వార్డులకు 17 నామినేషన్లు పడ్డాయని ఎంపీడీవో సింగారపు కుమార్ తెలిపారు. నెల్లికుదురు సర్పంచ్‌కు నాలుగు, రామన్నగూడెం-3, పార్వతమ్మగూడెం-2, మునిగలవీడు-1, శ్రీరామగిరి-1, నైనాల-1, బంజర-1, నర్సింహులగూడెం-3, హనుమాన్‌నగర్‌తండా-2, జామతండా-2, ఎర్రబెల్లిగూడెం-3, బోటిమీది తండా-1, ఆలేరు-4, రాజ్యతండా-1, కాస్యతండా-1, వస్రాంతండా-1 దుర్గాభవానితండా-1, బ్రాహ్మణపల్లి కొత్తపల్లి ఒక నామినేషన్‌ను స్వీకరించినట్లు ఎంపీడీవో తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి

(5వ పేజీ తరువాయి)

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత ఆరోపించారు. బీసీ లంతా ఒక్క సారి ఆలోచించి కాంగ్రెస్‌కు బుద్ధి చెపాలన్నారు. దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుపతలపెట్టిన దీక్షా దివస్‌కు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అంగోతు బిందు, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్లు మార్నేని వెంకన్న, ఎమ్డీ. ఫరీద్, యాకూబ్‌రెడ్డి, నీలం దుర్గేష్, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, నాయిని రంజిత్, గుండా రాజశేఖర్ పాల్గొన్నారు.

రగ్బీ పోటీలకు మోదుగులగూడెం విద్యార్థులు

కురవి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మోదుగులగూడెం జడ్పీఎస్ఎస్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సత్యనారాయణచారి, పీడీ దార్ల సునిల్ గురువారం తెలిపారు. డోర్నకల్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన సోనియా, సహన్‌లు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని, వారు ఈనెల 29 నుంచి మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు శ్రీరాములు, లత, సలీం, ఇందిర, దీపిక, వీరన్న, రజిత, భాగ్యలక్ష్మి అభినందించారు.

మహా జాతరను విజయవంతం చేస్తాం

– ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

ములుగు టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మేడారం మహాజాతరను విజయవంతం చేయడానికి పోలీసులు శాయశక్తులా కృషి చేస్తుందని, ఇందుకు ఇతర శాఖల అధికారులతో సమన్వయంగా పనిచేస్తామని ఎస్పీ సుధీర్ రాంనా థ్ కేకన్ అన్నారు. ములుగులోని పోలీసు జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పోలీసు శాఖ ప్రత్యేక ప్రణాళికతతో ముందుకు సాగుతోందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మహాజాతరకు 1.50 కోట్ల భక్తులు వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సుమారు 10 వేల మంది పోలీసు సిబ్బందిని నియమిస్తున్నామని తెలిపారు. జాతర సంద ర్భంగా అమ్మవార్లను దర్శించుకోవడానికి అందరికీ ఒకే నిబంధనలు ఉంటాయన్నారు. భక్తులకు మరో ఐదు క్యూలైన్లు అదనంగా ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఎనిమిది క్యూలైన్ల ద్వారా వనదేవతలను దర్శించుకోనున్న భక్తులు మూడు గేట్ల ద్వారా బయటకు వెళ్లడానికి ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

'ఫ్రైట్ ట్రైన్ సెంటర్‌ను డోర్నకల్‌లో స్థాపించాలి'



ఖమ్మంలో ఎంపీ రఘురాంరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు

డోర్నకల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రైల్వేజంక్షన్‌లో మెగా ఫ్రైట్‌ట్రైన్ డిపో మెయింటినెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్, రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డిని గురువారం తన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్నకల్ జంక్షన్‌లో ఫ్రైట్‌ట్రైన్ మెయింటినెన్స్ ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రదేశమని వివరించారు. ప్రస్తుతం రామగుండంలో మాత్రమే ఫ్రైట్‌ట్రైన్ మెయింటినెన్స్ డిపో ఉందని, అక్కడ విపరీతమైన రద్దీ ఉండడంతో రైల్వేశాఖ మరోడిపో ఏర్పాటుకు ప్రయత్నిస్తుందని చెప్పారు. ఆ డిపోను డోర్నకల్‌లో ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య తీరుతుందని, తద్వారా డోర్నకల్ రైల్వేస్టేషన్‌తోపాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఎంపీకి వివరించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుమీర్ చంద్‌జైన్, గారె రమేష్, ధరావత్ కృష్ణ, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు బషీర్‌అలీలు ఉన్నారు.

'పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి'



గార్లలో మాట్లాడుతున్న హరిప్రియనాయక్

గార్ల, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని గ్రామపంచాయతీల్లో బీఆర్ఎస్ సత్తాచాటాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియనాయక్ అన్నారు. గురువారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్యకార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన రెండు సంవత్సరాల కాలంలో గ్రామాల్లో అభివృద్ధి లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ మండల లధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, మీగడ శ్రీనివాస్, ముగి రాములు, ఖదీర్‌బాబా, బుడిగే మురళీ గౌడ్, యాకుబ్‌పాష పలువురు పాల్గొన్నారు.

ముందు నామినేషన్లు..

ఆపై ఉపసంహరణలు..!!

(5వ పేజీ తరువాయి)

కళకళలాడుతూ.. కన్పించాయి. అధికార, ప్రతిపక్ష నేతలే కాదు.. గ్రామాల్లో పట్టున్న పెద్దల ఇళ్ల వద్ద కూడా సందడి నెలకొంది.

అతి తక్కువ సమయంలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన వెంటనే నోటిఫికేషన్ రావడంతో సర్పంచ్ స్థానాలకు పోటీచేసే వారితో పాటు వార్డుసభ్యుల కోసం బరిలో దిగనున్న వారి హడావుడి ఇంతా.. అంతా కాదు.. తమ గాడ్‌ఫాదర్‌లను ప్రసన్నం చేసుకునేందుకు ఇప్పటికే పలుమార్లు ఆయా గడపలు ఎక్కి దిగిన నేతలు ఈ సారి తొలుత నామినేషన్ వేసి ఆపై వారి మద్దతు పొందేందుకు సన్నాహాల్లో నిమగ్నమయ్యారు.

నామినేషన్ దాఖలుకు కావాల్సిన వివిధ ధ్రువీకరణ పత్రాలకోసం అటు సర్కార్ కార్యాలయాలకు పరుగులు తీయడంతోపాటు తమ మద్దతుదారులను చేజారనివ్వకుండా నామినేషన్ దాఖలుకు పరుగులు తీయడం మొదలెట్టారు. పార్టీ సింబల్ రహిత ఎన్నికలు అయినప్పటికి పోలింగ్ విషయంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రభావితం తప్పనిసరి కావడంతో తమ గాడ్‌ఫాదర్‌లను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమవుతూనే నామినేషన్లు వేసుకోవడం ఆరంభించారు.

కాంగ్రెస్‌లో జోష్.. ఆపై బీఆర్ఎస్‌లోనూ..

దశాబ్దకాల అనంతరం స్వరాష్ట్రంలో తొలిసారిగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ మద్దతుతో పోటీచేసేందుకే ఎక్కువ మంది అసక్తి చూపుతుండగా.. ప్రతిపక్షంలోకి వెళ్లిన బీఆర్ఎస్‌లోనూ తక్కువ పోటీ ఏమి కన్పించడం లేదు. ఇక కొందరు గ్రామస్థాయి నాయకులైతే ముందుగా పోటీచేసి గెలిచి ఆపై ఎవరిదో ఒకరి మద్దతు పొందాలనే యోచన కూడా చేస్తున్నారు. మొత్తానికి ఆశావహుల్లో అనేకులు సిట్టింగ్ అధికార పార్టీ ఎమ్మెల్యేల, మాజీ ఎమ్మెల్యేలతో పాటు ప్రధాన రాజకీయ పార్టీల నాయకుల ఆశీస్సులు పొందేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

అయితే అధికార కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు మాత్రం తొలుత నామినేషన్ల పర్వం కొనసాగించండి.. ఆ తర్వాత అర్హత ఉన్న సమర్థులకు పార్టీ మద్దతు ఇస్తూ స్వపార్టీకి చెందిన ఇతరులను ఉపసంహరించుకునే బాధ్యత తాము తీసుకుంటామని చెబుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ రహిత పంచాయతీ ఎన్నికలను అధికార కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదుపుతూ.. గ్రామాల్లో అధికారం దక్కించుకోవాలనే చూస్తుండగా ప్రధాన ప్రతిపక్షం ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్ ఎన్నికల్లో సత్తా చాటుకోవాలని భావిస్తోంది.

మానుకోట నియోజకవర్గంతో తొలి విడత..

జిల్లాలో పంచాయతీ ఎన్నికల తొలివిడత ఎన్నికలుమహబూబాబాద్ నియోజకవర్గం పూర్తిస్థాయితో జరగనుండడంతో కాంగ్రెస్ ప్రాతినిధ్య స్థానిక శాసనసభ్యుడు మురళీనాయక్ క్యాంప్ ఆఫీస్ కళకళలాడుతోంది. ఇటీవలనే డీసీసీ అధ్యక్షురాలిగా నియామకమైన ఎమ్మెల్యే సతీమణి ఉమ కూడా ఉండడంతో.. ఈ దంపతుల ఆశీస్సులు పొందితే చాలు.. కాంగ్రెస్ మద్దతుతో నెగ్గవచ్చని నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు తమ అనుయాయులను తీసుకుని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. సహజంగానే గ్రామప్రాంత నాయకులే ఎమ్మెల్యేలకు పట్టుకొమ్మలుగా కొనసాగుతూ.. ఉండడం విదితమే. వారి మాట కాదనకుండా సర్పంచ్, వార్డుల ఎంపిక చేయడం కీలకంగా మారుతోంది.

నామినేషన్‌ల ఆరంభంతో మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, నెల్లికుదురు, గూడూరు మండలాల్లో ప్రధాన, ద్వితీయశ్రేణి నాయకుల్లో హడావుడి ముమ్మరమైంది. సర్పంచ్ కావాలని ఎప్పట్నుంచో కలలు కంటున్న ఆశావహులు దాన్ని నేరవేర్చుకునేందుకు తమ గాడ్‌ఫాదర్‌లపై ఆధారపడుతున్నారు. గ్రామాలపై ఆధిపత్యం పట్టు ఉన్న నేతల చుట్టు తిరుగుతూ.. తమకు అవకాశం కల్పిస్తే బరిలో నిలిచి మీకు అండగా కొనసాగుతామని చెప్పుకుంటున్నారు. పల్లె లీడర్లను ప్రసన్నం చేసుకుంటూ పోటీకి దిగుతున్నారు. ఒక్కో గ్రామంలో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు మూడుకు తగ్గకుండా కొన్ని గ్రామాల్లో పది మంది వరకు సర్పంచ్ పదవి దక్కించుకునేందుకు పోటీ పడుతుండగా బీఆర్ఎస్ నాయకులు మాత్రం గతంలో ఆయా స్థానాల్లో గెలిచినా.. ఓడినా నాయకులు ఈ సారి ఎలాగైనా గ్రామంపై పట్టు నిలుపుకునేందుకు బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు. వెరసి గ్రామాలన్ని ఎన్నికల జోష్‌లో మునిగి తేలుతున్నాయి.

సీఐటీయూ సభలను జయప్రదం చేయండి

● ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగన్న



సమావేశంలో మాట్లాడుతున్న నాగన్న

మహబూబాబాద్ టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ కేంద్రంలో ఈనెల 28, 29 తేదీల్లో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆల్ హమాలీ సంఘం జిల్లా కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో గురువారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా తక్కువ రేట్లతో పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీజన్‌లో మూడునెలలు మాత్రమే పని దొరుకుతుందని మిగతా సమయం అంతా ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంటుందని వారి సంక్షేమం కోసం ప్రత్యేకంగా బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. బానోత్ రవి, బత్తుల వెంకన్న, హేమానాయక్, లక్ష్మణ్, లాలు, సేవ్యా, నవీన్, మహేందర్, బాలు, లచ్చు, హరి, రాము, యుగేందర్ పాల్గొన్నారు.

జీపీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుడిగా మధుకర్‌బాబు

మహబూబాబాద్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా కె.మధుకర్‌బాబు, వ్యయ పరిశీలకుడిగా జి.శ్రీనివాస్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది. దీంతో ఇద్దరు అధికారులు గురువారం మానుకోటలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మధుకర్‌బాబును, జి.శ్రీనివాస్‌ను జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, జిల్లా నోడల్ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్, జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు, డీపీఆర్వో రాజేంద్రప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీమన్నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, వారికి పూల మొక్కలను అందజేశారు.

పారామెడికల్ కోర్సుల దరఖాస్తులకు డిసెంబరు 1 వరకు గడువు

భూపాలపల్లి టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పారామెడికల్‌లో వివిధ కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబరు 1 వరకు గడువు ఉందని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంక టేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం ఇంటర్మీడి యట్ ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. డీఎంఎల్‌టీ కోర్సులో 30, డీఈసీజీ కోర్సులో 30 సీట్లు భర్తీ చేయనున్నట్లు వివరించారు.